సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 3 । మే । 2024



కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ విమర్శించారు.

- IIIలో ▸



ఎంపీగా చేసిందేమీ లేదు

బీబీ పాటిల్ ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు విమర్శించారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
43.8 /21.7

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే చర్యలు

కామారెడ్డి క్రైం: రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ హెచ్చరించారు. ఈ విషయమై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, విజిలెన్స్ బందాలు, తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ రవాణాతో పాటు స్టోరేజ్ పాయింట్‌లపైనా నిఘా పెట్టామని పేర్కొన్నారు. పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న చౌక ధరల దుకాణాలపైనా కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 531.96 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశామని పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్ తనిఖీ



భిక్కనూరు: జంగంపల్లి, భిక్కనూరు, బస్వాపూర్‌లలోని విద్యుత్ సబ్‌స్టేషన్లను గురువారం ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేశ్‌బాబు తనిఖీ చేశారు. బస్వాపూర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 11 కేవీ ఫీడర్‌ను పరిశీలించారు. సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాలని, వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కారించాలని ఆదేశించారు. ఎస్‌ఈ వెంట ఏడీఈ కిరణ్, ఏఈ రామలక్ష్మి, సబ్ ఇంజినీర్ శివతేజ తదితరులు ఉన్నారు.

మోదీ పాలనకు ప్రజల సంపూర్ణ మద్దతు



నిజాంసాగర్(జుక్కల్): మరోమారు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనకోసం ప్రజలు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు బీబీ పాటిల్ అన్నారు. గురువారం జుక్కల్ మండలంలోని కౌలాస్, వజ్రకండి, దోస్త్‌పల్లి, గుండూర్, పెద్దగుల్లా గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి జహీరాబాద్ గడ్డపైన బీజేపీ జెండాను ఎగుర వేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార, మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం, ఎంపీ సతీమణి అరుణపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

- గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ



డిచ్‌పల్లి: ఎండలు అధికంగా ఉండటంతో ఉపాధి హామీ పనులు జరిగే చోట టెంట్లు, తాగునీటి వసతి కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ సూచించారు. గురువారం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) తరుణ్ చక్రవర్తి, డీఆర్‌డీవో సాయాగౌడ్‌తో కలిసి డిప్యూటీ కమిషనర్ ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటితో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అన్ని గ్రామాల్లో తాగు నీటి సరఫరాకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగు నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచాలన్నారు. డీఎల్‌పీవో శ్రీనివాస్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి మండలాల ఎంపీడీవోలు రవీందర్, అనంత్‌రావు, బాలకృష్ణ, డీపీఎం నరహరి, ఏపీవో సుధాకర్‌రెడ్డి, టీఏలు అరుంధతి, ఉమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం



- స్వేచ్ఛగా ఓటేసే వాతావరణం కల్పిస్తున్నాం
- ఈవీఎంలపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- 'సాక్షి'తో కలెక్టర్ జితేష్ వి పాటిల్

"లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నాం'' అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఈవీఎంల విషయంలో వదంతులను ఎవరూ నమ్మవద్దన్నారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిపై, వదంతులు సృష్టించే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన గురువారం 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో 6,80,921 మంది ఓటర్లున్నారు. ఇందులో 3,28,879 మంది పురుషులు, 3,52,012 మంది స్త్రీలు, 30 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. వీరికోసం 913 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. 4,388 మంది పోలింగ్ కోసం సిబ్బందిని నియమించి వారికి శిక్షణ ఇచ్చాం. 85 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించాం.

కేంద్రాల వద్ద సౌకర్యాలు..

ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు పొడిగించింది. ఓటర్లు తమకు వీలైన సమయంలో కచ్చితంగా ఓటు వేయాలి. కేంద్రాల వద్ద నీడ కోసం టెంట్‌లు, తాగు నీటి సౌకర్యం కూడా కల్పిస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికల్లో 79 శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి పోలింగ్ శాతం పెరిగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నాం.

ఓటరు స్లిప్పుల పంపిణీ..

పోలింగ్ రోజున ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ఇంటింటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో 80 శాతం స్లిప్పుల పంపిణీ పూర్తయ్యింది. కామారెడ్డిలో 50 శాతం పంపిణీ చేశాం. అందరికీ ఓటరు స్లిప్పులు అందిస్తాం.

ఇంటి వద్దే ఓటు..

జిల్లాలో 85 ఏళ్లు పైబడిన వారితో పాటు, కేంద్రానికి వెళ్లే పరిస్థితిలో లేని వారిని గుర్తించి వారితో ఇంటి వద్దనే ఓటు వేయించడానికి చర్యలు తీసుకున్నాం. 4, 5, 6 తేదీలలో హోం ఓటింగ్ నిర్వహిస్తాం. ఇందుకోసం 12 బృందాలు ఏర్పాటు చేశాం. హోం ఓటింగ్ కోసం జిల్లాలో 439 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారితోపాటు వైద్యం కోసం ఆస్పత్రుల్లో ఉన్న మరో ఐదుగురి ఓట్లను కూడా వారి వద్దకు వెళ్లి వేయిస్తాం.

బరిలో 19 మంది..

జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీంతో ఒక్కో బూత్‌కు రెండు బ్యాలెట్ యూనిట్లు పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఓటింగ్ కోసం ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్స్ సిద్ధం చేశాం. 2,794 బ్యాలెట్ యూనిట్స్, 1,702 ఈవీఎంలు, 1,218 వీవీ ప్యాట్ యూనిట్లను సిద్ధం చేశాం. జిల్లాలో ఎన్నికల నిర్వహణ విధుల్లో 4,473 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు. జిల్లాలో ఇప్పటికే పోలింగ్ సిబ్బందికి ఎన్నికలపై అన్ని స్థాయిల్లో శిక్షణ ఇచ్చాం.

183 సమస్యాత్మక బూత్‌లు..

జిల్లాలో 64 లొకేషన్లలో 183 పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకమైనవిగా గుర్తించాం. వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి అల్లర్లు, గొడవలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన అనుభవం ఉన్నందున లోక్‌సభ ఎన్నికలు కూడా ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని ఆశిస్తున్నాం.

ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు

కామారెడ్డి క్రైం: ఎన్నికలు, ఇతర అత్యవసర విధులు నిర్వహిస్తున్న 4,546 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో 1,081, ఎల్లారెడ్డిలో 1,298, కామారెడ్డి నియోజకవర్గంలో 2,167 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం జుక్కల్ నియోజక వర్గానికి సంబంధించి మద్నూర్ తహసీల్ కార్యాలయంలో, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో, కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి కామారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పొందిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలీసులు ఈ నెల 4, 5 తేదీలలో ఆయా నియోజక వర్గాల్లో కార్యాలయ పనివేళల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓపీవోలు ఈనెల 6, 7 తేదీలలో ఓటే వేయాలని పేర్కొన్నారు.

పారదర్శకంగా అనుబంధ ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ఈవీఎంల అనుబంధ ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా పూర్తి చేశామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. 990 ఈవీఎంలకు గురువారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాములో అనుబంధ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి 19 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నందున అదనపు బ్యాలెట్ యూనిట్‌లు అవసరమయ్యాయని, దీంతో అనుబంధ ర్యాండమైజేషన్ చేపట్టామని పేర్కొన్నారు. ఈ ఈవీఎంలకు సంబంధించిన మొదటి దశ పరిశీలనను బుధవారం ఈసీఐఎల్ ఇంజినీర్ల ద్వారా పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కామారెడ్డి క్రైం: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎస్‌వో మల్లికార్జున్ బాబు సూచించారు. గురువారం ఆయన అడ్లూర్, ఇస్రోజీవాడి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 28,189 మంది రైతుల నుంచి రూ. 342 కోట్ల విలువైన 1.55 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులకు రూ.235 కోట్లు చెల్లించామన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సమయం పెరిగింది

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సాధారణ ఎన్నికల్లో పోలింగ్ సమయం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా పోలింగ్ సమయాన్ని ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెంచుతూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకుని వంద శాతం ఓటింగ్ నమోదుకు సహకరించాలని కోరారు. అలాగే ఓటింగ్ గోప్యతను పాటిస్తూ పారదర్శకంగా హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఓటింగ్‌ను వీడియో రికార్డ్ చేస్తామని పేర్కొన్నారు. హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు 4, 5 తేదీలలో ఇంటి వద్ద అందుబాటులో ఉండి, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఫిర్యాదు చేయవచ్చు..

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, ఇతర అంశాలు ఏమైనా ఉంటే సాధారణ ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జీ తివారి కామారెడ్డిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఏ విషయంపైనైనా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అభ్యర్థులు ఆయనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎన్నికల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే ఆయన నివృత్తి చేస్తారని, సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తారని పేర్కొన్నారు. నేరుగా కలవడం వీలు కానివారు 79956 92890 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విధులను పారదర్శకంగా నిర్వహించాలి

- సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

కామారెడ్డి క్రైం: లోక్‌సభ ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ ఆదేశించారు. గురువారం ఆయన న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల అధికారులతో మాట్లాడారు. పోలింగ్ సన్నద్ధతపై సమీక్షించారు. కలెక్టర్లు, ఎస్పీలకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 78 శాతం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సింధు శర్మ, ఎన్నికల విభాగం అధికారులు ప్రేంకుమార్, సుమలత, సరళ, స్వప్న, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

అటు ఎండ.. ఇటు రాజకీయ వేడి

- ఉమ్మడి జిల్లాలో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- పోలింగ్ సమయం సమీపిస్తుండడంతో అభ్యర్థుల స్పీడ్
- ఉదయం, సాయంత్రం సమయాల్లో విస్తృతంగా ప్రచారం
- నిజామాబాద్, జహీరాబాద్ స్థానాల్లో త్రిముఖ పోటీ..

ఓవైపు ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైగా నమోదవుతుండగా.. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాల పరిధిలో రాజకీయం మరింతగా వేడెక్కింది. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా ఎండ వేడిమిని లెక్కచేయకుండా శ్రమిస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రచారానికి కేటాయిస్తూ.. మధ్యాహ్న సమయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్నారు.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ నడుస్తున్న నేపథ్యంలో త్రిముఖ పోటీ నెలకొన్న నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారంలో పాల్గొంటున్నారు. దీంతో రాజకీయం మరింత వేడెక్కింది. ఇదిలా ఉండగా మరోవైపు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్నాయి. గత వారం రోజులుగా పలుచోట్ల 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఎండ వేడిమిలోనే తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. గెలుపే లక్ష్యంగా ఉష్ణోగ్రతలను లెక్కచేయకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో చెమటోడుస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమయాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నప్పటికీ వేడిమి ఎక్కువగా ఉంటున్న మాధ్యాహ్నం సమయాల్లోనూ సమావేశాలు ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్నారు.

ఉత్తర తెలంగాణలో కీలకమైన, రైతుల ప్రభావం ఉన్న నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో త్రిముఖ పోటీ నెలకొంది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ తరుపున సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి సీనియర్ నేత బాజిరెడ్డి గోవర్ధన్‌లు బరిలో ఉన్నారు. తమ గెలుపు కోసం తీవ్రంగా పోటీపడుతున్నారు. ముగ్గురు బలమైన నాయకులు పోటీలో ఉండడంతో ఓట్ల చీలిక ఏవిధంగా ఉంటుందనేది అంతుబట్టని విధంగా ఉంది. ఎవరి గెలుపోటములను ఎవరు ప్రభావితం చేస్తారనే విషయమై ఉత్కంఠ నెలకొంది. జహీరాబాద్ స్థానం పరిధిలో బీజేపీ నుంచి సిట్టింగ్ అభ్యర్థి బీబీ పాటిల్, కాంగ్రెస్ నుంచి సురేశ్ షెట్కార్, బీఆర్‌ఎస్ నుంచి గాలి అనిల్‌కుమార్ బరిలో ఉన్నారు. ఇక్కడా త్రిముఖ పోరు నెలకొంది. పార్లమెంట్ నియోజకవర్గాల విస్తీర్ణం భారీగా ఉండడంతో పాటు పోలింగ్‌కు కేవలం 9 రోజులు మాత్రమే, ప్రచారానికి 8 రోజులు మాత్రమే ఉండడంతో చెమటోడ్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. అభ్యర్థులతో పాటు సీనియర్లు, 70 ఏళ్ల పైబడిన నాయకులు సైతం పట్టువదలకుండా తిరుగుతున్నారు. ప్రతి నిముషాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు. ఎండల తీవ్రత ఎలా ఉందంటే ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని ఒక గంట పెంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటేసే అవకాశం కల్పించింది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు..

- ఎన్నికల వేడి నేపథ్యంలో భానుడి భగభగలు మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటి బెంబేలెత్తిస్తున్నాయి.
- గత నెల 29న నిజామాబాద్ జిల్లాలోని వర్ని మండలం జాకోరాలో 44.8 డిగ్రీలు, ఆర్మూర్ మండలం పెర్కిట్‌లో, నిజామాబాద్ దక్షిణ మండలంలో 44.3 డిగ్రీలు.
- గత నెల 30న నిజామాబాద్ దక్షిణ మండలంలో 44.5, వర్ని మండలం జాకోరాలో 44.4, వేల్పూర్‌లో 44 డిగ్రీలు, కామారెడ్డి జిల్లాలోని బిచ్కుందలో 44.3, బాన్సువాడ మండలం కొల్లూరులో 44.2, నిజాంసాగర్ మండలం హసన్‌పల్లిలో 44.1.
- ఈ నెల 1న మోపాల్‌లో 44.2, నిజామాబాద్ ఉత్తర మండలంలో 43.9, వేల్పూర్‌లో 43.7 డిగ్రీలు, కామారెడ్డి జిల్లా పాతరాజంపేటలో 43.8, రామారెడ్డిలో 43.7, బిచ్కుందలో 43.7.
- ఈనెల 2న ముప్కాల్ మండలం వేంపల్లెలో 44.2, మోర్తాడ్‌లో 43.7, నిజామాబాద్ ఉత్తర మండలంలో 43.5 డిగ్రీలు కామారెడ్డిలో 43.8, రామారెడ్డిలో 43.3, బిచ్కుందలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి జిల్లాలో మరో 30 ప్రాంతాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానురాను ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

ఆదుకున్నోళ్లకే ఓటు వేయండి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

గాంధారి/తాడ్వాయి: ఆపదలో ఆదుకున్నవారికి, సంక్షేమ పథకాలు అందించిన వారికే ఓటు వేయాలని, అబద్ధాలు ఆడేవారికి ఓటు వేయొద్దని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం గాంధారి, తాడ్వాయి మండలాల్లో నిర్వహించిన రోడ్‌షోలలో ఆయన బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు అబద్ధాలు చెప్పి, అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీల ఊసెత్తడం లేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని మర్చిపోయారన్నారు. బీబీ పాటిల్ పదేళ్లు ఎంపీగా ఉండి ఏ అభివృద్ధి చేయలేదని, సురేష్ షెట్కార్ కూడా జహీరాబాద్ ఎంపీగా పనిచేసి ఉద్ధరించింది ఏమీలేదని, వీరిద్దరూ దద్దమ్మలేనని ఎద్దేవా చేశారు. బీబీ పాటిల్ పార్టీని మార్చినంత మాత్రాన బీజేపీకి ఎవరూ ఓటు వేయరన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ..తనను పెద్ద మనసుతో ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపిస్తే మీ సమస్యలపై పోరాడుతానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, తాడ్వాయి మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సిములు, జెడ్పీటీసీ రమాదేవి, బీఆర్‌ఎస్ పార్టీ గాంధారి మండలాధ్యక్షుడు శివాజీరావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు పెద్దబూరి సత్యం, సత్యం రావు, బలరామ్ నాయక్ పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్ షో రూట్ మ్యాప్ పరిశీలన

కామారెడ్డి క్రైం: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 7న కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ రోడ్‌షో రూట్ మ్యాప్‌ను గురువారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, నల్లమడుగు సురేందర్ పరిశీలించారు. కార్యక్రమ ఏర్పాట్లపై స్థానిక నేతలకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్ రావు, నాయకులు పరికి ప్రేంకుమార్, జూకంటి ప్రభాకర్‌రెడ్డి, రామ్మోహన్, భూంరెడ్డి, లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్, భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షో స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రశాంత్‌రెడ్డి, గంప గోవర్ధన్, సురేందర్

క్లుప్తంగా

బీఆర్ఎస్‌తోనే భరోసా

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడ: బీఆర్ఎస్‌తోనే ప్రజలకు భరోసా ఉందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడలో మాజీ ఏఎంసీ చైర్మన్ నార్ల రవీందర్ బీఆర్ఎస్‌లో చేరారు. పోచారం బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. బీఆర్ఎస్ అంటే ప్రజలకు భరోసా ఉంటుందని అన్నారు. రానున్న కాలంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, కృష్ణారెడ్డి, నార్ల ఉదయ్, నాగులగామ వెంకన్న, దాసరి శ్రీనివాస్ తదితరులున్నారు.

బీబీపాటిల్ ఎంపీగా చేసిందేమీ లేదు

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్



గాంధారి(ఎల్లారెడ్డి): బీబీ పాటిల్ పదేళ్లు బీఆర్ఎస్ పార్టీ నుంచి జహీరాబాద్ ఎంపీగా ఉండి చేసిందేమి లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్‌మోహన్ విమర్శించారు. గురువారం పలు గ్రామాలు, తండాల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టగానే బీబీపాటిల్ అధికారం కోసం పార్టీ మారి బీజేపీలో చేరాడని ఆరోపించారు. బీబీపాటిల్ ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి రాలేదని, తన వ్యాపారాలను కాపాడుకోడానికే రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పాటిల్‌కు అభివృద్ధి అవసరం లేదని అధికారమే కావాలని అన్నారు. ఈ ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని కోరారు.

గాంధారి జెడ్పీటీసీ కాంగ్రెస్‌లో చేరిక

గాంధారి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ శంకర్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ మోతీలాల్ గురువారం ఎమ్మెల్యే మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు.

5న మెగా రక్తదాన శిబిరం



కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం ఈ నెల 5న కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు. గురువారం రక్తదాన శిబిరం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు డాక్టర్ వేద ప్రకాష్, రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ కార్యదర్శి జమీల్ అహ్మద్, డాక్టర్ పి.అనిల్‌కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు బీజేపీ వ్యతిరేకం



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



పాల్గొన్న బీడీ కార్మికులు

● కార్మికులకు పింఛన్ ఇస్తున్న రాష్ట్రం మనదే..
● పీఎఫ్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఇస్తాం
● కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: బీడీ కార్మికులకు బీజేపీ వ్యతిరేకమని.. ఎంపీ అర్వింద్ ఐదేళ్లలో బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయలేదని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు కల్యాణ మండపంలో గురువారం బీడీ కార్మికుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 33 శాతం జీఎస్టీ వేయడంతో బీడీ పరిశ్రమ ప్రమాదంలో పడిందని, వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీడీ పరిశ్రమపై జీఎస్టీ తొలిగిస్తామన్నారు. బీడీ పరిశ్రమకు నిజామాబాద్ ఆయువపట్టుగా ఉందన్నారు. ఆడ బిడ్డలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని, 2014 కటాఫ్ తేదీని తొలగిస్తామన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లో బీడీ పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవని, మనరాష్ట్రంలో మాత్రమే పింఛన్ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అందుతున్న పింఛన్ మొత్తాన్ని పెంచి ఇవ్వనుందన్నారు. డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశవేణు, గడుగు గంగాధర్, ఐఎన్‌టీయూసీ నేత గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'పదేళ్ల నుంచి జహీరాబాద్‌ను దోచుకున్నారు'

● ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పిట్లం(జుక్కల్): జహీరాబాద్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ గత పదేళ్ల నుంచి జహీరాబాద్‌ను దోచుకొని ఏ మాత్రం అభివృద్ధి చెయ్యలేదని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు విమర్శించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పిట్లం అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతికి అడ్డైన హన్మంత్ సింధేకు ఏవిధంగా బుద్ధి చెప్పి ఓడించారో అదే విధంగా ఇప్పుడు బీబీ పాటిల్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కార్, నాయకులు రాంరెడ్డి, జంబిగే హన్మాండ్లు, షేక్ నజీర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలి

బాన్సువాడ రూరల్: ఎన్నికల సిబ్బంది తమ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏఆర్‌వో, బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్ సూచించారు. గురువారం శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల అధికారులకు రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అధికారులకు అందించిన హ్యాండ్‌బుక్ చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ జరిగే 90 నిమిషాల ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ చేపట్టాలన్నారు. అనుమానాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు, తహసీల్దార్ వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ వై. శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలువలో పేరుకుపోయిన చెత్త

● ఉపాధిహామీ పథకం ద్వారా తొలగించాలని రైతుల డిమాండ్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి కాలువకు అనుబంధంగా ఉన్న మైనర్ కాలువలో భారీగా చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రధాన కాలువ 3.5 కిలోమీటర్ల పొడవు ఉండగా, అక్కడ నుంచి నాలుగు ఉప కాలువలున్నాయి. ప్రధానకాలువతోపాటు, ఉప కాలువల్లో పూడిక, చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ప్రతి ఏడాది నీటి ప్రవాహానికి అడ్డు ఏర్పడుతోంది. లక్ష్మి కాలువను 500 క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యంతో నిర్మించారు. కానీ ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీటిని వదిలితే గండ్లు పడే ప్రమాదం ఉంది. పాలకులు స్పందించి ఉపాధిహామీలో భాగంగా కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



మైనర్ కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ప్రస్తుతం పల్లెల్లో ఉపాధిహామీ పథకం పనులు ఊపందుకున్నాయి. వేసవి కాలం కావడంతో కూలీలు పెద్ద సంఖ్యలో పనులు చేస్తున్నారు. చెరువుల్లో తవ్వకం పనులు చేపడుతున్నప్పటికీ.. ఎక్కువ చెరువులో నీరు ఉంది. లక్ష్మికాలువ ముప్కాల్ మండల కేంద్రంతోపాటు నల్లూర్, కొత్తపల్లి, వేంపల్లి, రెంజర్ల, మోర్తాడ్ మండలం శెట్‌పల్లి వరకు ప్రవహిస్తుంది. ఆయా గ్రామాలకు చెందిన ఉపాధిహామీ కూలీలతో పూడిక తొలిగింప పనులు చేపడితే ప్రయోజనం ఉంటుందని, ఆయకట్టు ప్రయోజనాలు కాపాడిన వారవుతారని రైతులు అంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారులకు విన్నవించాం

కాలువల్లో పూడికతీత పనులను ఉపాధిహామీ కూలీల ద్వారా చేపట్టాలని గతంలోనే సంబంధిత అధికారులకు విన్నవించాం. అయినప్పటికీ పనులు చేపట్టలేదు. ప్రస్తుత సంవత్సరం కూడా సంబంధిత అధికారులకు లేఖలు రాస్తాం.

– సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య



సాయిలు (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన సరికెల సాయిలు (50) తన వ్యవసాయ క్షేత్రం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న సాయిలుకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహమైంది. సుమారు రూ.7లక్షల వరకు అప్పులుకాగా, రెండో కుమార్తె భర్త ఆత్మహత్య చేసుకోవడంతో ఆమె ఇంటి వద్దే ఉంటుంది. దీనికితోడు ఆరోగ్యం సహకరించకపోవడంతో సాయిలు మనస్తాపానికి గురై గురువారం ఉదయం వ్యవసాయక్షేత్రం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెల కాపరులు గమనించి సాయిలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత..

నిజాంసాగర్(జుక్కల్): అత్త, మామ వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆరేడ్‌లో గురువారం చోటు చేసుకుంది. బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరేడ్‌కు చెందిన గడ్డం రాజుకు స్వప్నతో మూడేళ్ల క్రితం వివాహం కాగా, కూతురు ఉంది. రాజు హైదరాబాద్‌లో ఉంటూ పెయింటింగ్ పని చేస్తుండగా, స్వప్న ఆరేడ్‌లోనే అత్తామామలతో కలిసి ఉంటూ కూలీ పని చేస్తోంది. అత్త రత్నవ్వ, మామ క్రీస్తోత్తం ఆమెను తరచూ వేధించడంతోపాటు బుధవారం రాత్రి సూటిపోటి మాటలతో దూషించారు. దీంతో తీవ్రమనస్తాపానికి గురైన స్వప్న(22) ఇంట్లోని దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎస్సై సుధాకర్ తదితరులున్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు

ఒకరి మృతి.. ఇద్దరికి గాయాలు



మాచారెడ్డి: బంధువుల ఇంట్లో నిర్వహించిన ఎల్లమ్మ పండక్కి వెళ్లి తిరిగి వస్తుండగా కారు చెట్టను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. చుక్కపూర్ వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రాజానగర్‌కు చెందిన అలకుంట యాదనర్సయ్య (55) తన భార్య లలిత, మనవడు శివరాత్రి దిలీప్‌తో కలిసి గత నెల 30 న రాజన్న సిరిసిల్లకు వెళ్లాడు. అక్కడ బంధువుల ఇంట్లో నిర్వహించిన ఎల్లమ్మ పండుగలో పాల్గొని గురువారం ఉదయం తిరిగి వస్తుండగా చుక్కాపూర్ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఆ ఘటనలో యాదనర్సయ్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన లలిత, దిలీప్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు దాటుతుండగా..

భిక్కనూరు: మామిడిపండ్లు కొనేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని కామారెడ్డికి చెందిన అర్కల వెంకట్(39) మృతి చెందాడు. ఈ ఘటర గురువారం మండలంలోని జంగంపల్లి శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

చైన్ స్నాచర్ రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై ప్రవీణ్ గురువారం తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి.. హమాల్‌వాడీకి చెందిన చికోటి పుష్ప గురువారం ఉదయం తన మనవరాలితో కలిసి సుభాష్‌నగర్‌లోని రామాలయానికి వచ్చి తిరిగి వెళ్తోంది. అదే సమయంలో స్కూటీపై వచ్చిన వ్యక్తి ఆమె దృష్టి మరలచి మెడలోని 3తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లాడు. అప్రమత్తమైన పుష్ప మనవరాలు దొంగను వెంబడించగా గొలుసును వదిలేసి పారి పోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రూ.10 లక్షల సిగరెట్ కాటన్లు చోరీ



విచారిస్తున్న డీఎస్పీ

కామారెడ్డి క్రైం: పట్టణంలోని గంజి మార్కెట్ లో ఉన్న శ్రీరాఘవేంద్ర ట్రేడర్స్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి తరువాత తాళాలను పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు లోనికి చొరబడి 8 కాటన్‌ల సిగరెట్ డబ్బాలను ఎత్తుకెళ్లారు. ఉదయం దుకాణానికి వచ్చిన యజమాని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు సిబ్బంది పరిశీలించి విచారణ జరిపారు. దుండగులు ఎత్తుకెళ్లిన సిగరెట్ కాటన్ల విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని దుకాణం యజమాని శశిధర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను గుర్తించేందుకు రెండు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు.

జానకంపేటలో..

ఎడపల్లి(బోధన్): మండలంలో వరుస దొంగతనాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జానకంపేటకు చెందిన రాచర్ల రాంబాబు అనే వ్యక్తి ఇంట్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బుధవారం రాత్రి ధాన్యం కుప్పవద్ద కాపలాకు వెళ్లిన రాంబాబు అర్ధరాత్రి తరువాత వచ్చి పడుకున్నాడు. తలుపు గడియ వేయకపోవడంతో తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాలోని రూ.20వేల నగదును ఎత్తుకెళ్లారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన రాజాగౌడ్ కుటుంబ సభ్యులు దాబాపై నిద్రించారు. చోరీకి వచ్చిన దుండగుడు రాజాగౌడ్ భార్య మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించే ప్రయత్నం చేయగా మెలకువ వచ్చి ఆమె అరవడంతో పరారయ్యాడు. పోలీసు పెట్రోలింగ్ లేకపోవడంతోనే వరుస చోరీలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రిఫరల్ దందాపై నజర్

● ఆర్ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లపై అధికారుల దాడులు
● నిబంధనలు పాటించని కేంద్రాలు సీజ్

నిజామాబాద్ నాగారం: అమాయక రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తూ కమీషన్లు దండుకుంటున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై అధికారులు దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్లినిక్‌లను సీజ్ చేస్తున్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు గతంలో ప్రాథమిక వైద్యం చేసేవారు. అయితే ప్రస్తుతం తమ దగ్గరకు వచ్చిన రోగులను ప్రైవేట్ ఆస్ప్రతులకు రిఫర్ చేస్తూ.. ఆయా ఆస్పత్రుల నుంచి కమీషన్ తీసుకుంటున్నారు. అంతేకాకుండా ప్రథమ చికిత్సకు పరిమితం కావాల్సిన వారు ఇంజెక్షన్లు ఇవ్వడం, సెలైన్లు పెట్టడం చేస్తున్నారు. దీంతో అధికారులు సెంటర్లపై దాడులు చేసి, నిబంధనలు పాటించని వాటిని సీజ్ చేస్తున్నారు.

పోటీ పెరగడంతో..

జిల్లాలో కేంద్రంలోని ఖలీల్‌వాడీ, ప్రగతినగర్, హైదరాబాద్‌రోడ్, పోచమ్మగల్లీలో వందల సంఖ్యలో ప్రైవేట్ ఆస్పత్రులు వెలిశాయి. ఆయా ఆస్పత్రుల మధ్య పోటీ పెరిగింది. దీంతో ఆస్పత్రుల యాజమాన్యాలు, నిర్వాహకులు వారికి పీఆర్‌వోలను గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీల వద్దకు పంపించి కమీషన్లు ఇస్తామని ఒప్పందాలు చేసుకుంటున్నారు. రోగులను రిఫర్ చేయడానికి బహుమతులు, విందు విలాసాలు, వస్తువులు ఉచితంగా ఇచ్చి మచ్చిక చేసుకుంటున్నారు.

కొనసాగుతున్న దాడులు..

ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స అందించకుండా సూదులు, మందులు, సెలైన్లు పెడుతున్నారని ఫిర్యాదు రావడంతో వైద్యాధికారులు దాడులు చేశారు. జనవరిలో మూడు క్లినిక్‌లను సీజ్ చేశారు. ప్రాథమికి చికత్స మాత్రమే చేయాలని వారు ఆదేశాలు ఇచ్చారు. నిబంధనలు పాటించని కేంద్రాలపై దాడులు కొనసాగుతాయని సమాచారం. అయితే దాడులపై ఆర్ఎంపీ, పీఎంపీలు నిరసన తెలుపుతున్నారు. కావాలనే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. లేనిపోని ఆరోపణలు చేస్తూ ఐఎంఏ వారే దాడులు చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తమను ఇబ్బందులకు గురి చేయవద్దని కోరుతున్నారు.

దాడులు సరికాదు

గ్రామీణ ప్రాంతాల్లో సేవలు చేసుకుంటున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు కావాలనే దాడులు చేయిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా సేవ చేస్తున్న మాపై దాడులు సరికాదు. ప్రతి ఒక్కరికి నర్సింగ్ హోంలల్లో ఐదేళ్ల పని చేసిన అనుభవంతో పాటు సర్టిఫికెట్ ఉంది.

– సాయిబాబా, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మాకేం సంబంధం లేదు

జిల్లాలో ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై జరుగుతున్న దాడులతో ఐఎంఏకు ఎలాంటి సంబంధం లేదు. మేము దాడులు చేయమని ఎవరికి చెప్పలేదు.

– డాక్టర్ దామోదర్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు

బాల్య వివాహంపై విచారణ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎల్లమ్మతండాలో గతనెల 30వ తేదీన మైనర్ జంట పెళ్లి(బాల్య వివాహం)పై గ్రామ పంచాయతీ కార్యదర్శి మమత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా సభ్యులు గురువారం విచారణ చేపట్టారు. ఎల్లమ్మతండా గుడి వద్ద మైనర్లకు వివాహం చేయగా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా సభ్యులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమాచారం అందింది. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి స్వామి, సోషల్ వర్కర్ మోహన్, చైల్డ్ హెల్ప్‌లైన్-1098 కో ఆర్డినేటర్ స్వరూప విచారణలో పాల్గొని స్థానిక ఎంపీడీవోకు సమాచారం అందించారు. బాల్య వివాహం చేసిన సభావత్ ఫంగి, సర్దార్, బర్మావత్ సర్వన్, హన్సి, దేగావత్ బాబు, కల్లి, గణేశ్, సరిత, సభావత్ చాయ్, రవీందర్, వసురాం, సార్వతి, దేవీసింగ్, లలితపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

గాంధారి: ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు చోట్ల గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గాంధారి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ యాదగిరి, హోంగార్డు మోతీలాల్ విధుల్లో భాగంగా బైక్‌పై మేడిపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా తిమ్మాపూర్ స్టేజీవద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం యాదగిరిని హైదరాబాద్‌కు, మోతీలాల్‌ను నిజామాబాద్‌కు తరలించారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ పైనుంచి పడి మహిళకు..

రుద్రూర్: ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి పడిపోయిన ఘటనలో కోటగిరికి చెందిన తేజస్వి(38)కి తీవ్ర గాయాలయ్యాయి. కోటగిరి నుంచి బీర్కూర్‌కు వెళ్తుండగా కల్లూర్ శివారులో బైక్ పైనుంచి తేజస్వి కిందపడిపోయిందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు అదుపు తప్పి పల్టీలు కొట్టిన ఘటనలో..

ఇందల్వాయి: మండలంలోని దేవితండా వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ నగరానికి చెందిన మాధురి, అశోక్ హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా దేవితండా వద్ద కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.



దేవితండా వద్ద ప్రమాదానికి గురైన కారు

ఎదురెదురుగా వాహనాలు ఢీకొని..

నిజామాబాద్‌రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని ముబారక్‌నగర్ వద్ద రెండు వాహనాలు ఢీకొన గా ఒకరికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపా రు. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న డీసీఎం, ఆర్మూర్ నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న టాటావ్యాన్ ముబారక్‌నగర్ వద్ద ఢీకొన్నాయన్నా రు. టాటావ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయని, కాలు విరిగిందని తెలిపారు. ఈ ఘటనపై ఎ లాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

దీపం మంటలు వ్యాపించి అగ్నిప్రమాదం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ఓ ఇంట్లో దేవుని వద్ద వెలిగించిన దీపం మంటలు వ్యాపించి అగ్నిప్రమాదం జరిగింది. గురువారం ఉదయం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. బీడీ ప్యాకింగ్ పనిచేసే గజ గణేశ్ తన భార్య పద్మతో కలిసి బడిమజీద్ సమీపంలో అద్దెకు ఉంటున్నాడు. గురువారం ఉదయం దేవుని దగ్గర దీపం వెలిగించిన అనంతరం పద్మ పక్క ఇంట్లోకి వెళ్లింది. కొద్దిసేపటికి ఇంట్లో నుంచి దట్టమైన పొగలు రావడంతో ఇరుగుపొరుగు వారు చూసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లోని సామగ్రితోపాటు బీరువాలోని దుస్తులు కాలిపోయాయి. సుమారు రూ.80 వేల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ఫైర్ సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలను ఆర్పలేకపోతే మంటలు పక్కింట్లోకి వ్యాపించేవని, పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.



దగ్ధమైన సామగ్రి

టేకు దుంగలు పట్టివేత

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను కమ్మర్‌పల్లి అటవీ క్షేత్ర పరిధి అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు గ్రామానికి చెందిన మహేశ్, నగేశ్, సాయి ఇళ్ల పరిసరాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు.. అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 70 టేకు దుంగలను స్వాధీనం చేసుకొని కమ్మర్‌పల్లిలోని కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని ఎఫ్ఆర్‌వో రవీందర్ తెలిపారు.

ఎల్లారెడ్డి శివారులో..

ఎల్లారెడ్డి: అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను పట్టణ శివారులోని దేవునిపల్లి వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి ఓంకార్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా బైక్‌పై టేకు దుంగలను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బంది తనిఖీ నిర్వహించారన్నారు. నిందితులు బైక్‌ను వదిలి పారిపోయారన్నారు. టేకు దుంగలతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.



కోనసముందర్‌లో స్వాధీనం చేసుకున్న కలప

ధాన్యం లారీ బోల్తా



రాజంపేట: ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన గురువారం రాజంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోచారంలోని కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలు లోడ్ చేసుకుని రైస్‌మిల్లుకు తరలిస్తుండగా లారీ బోల్తాపడిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయన్నారు.

మద్యం స్వాధీనం

జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్‌కు చెందిన రొడ్డ రాజేశ్వర్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడిచేసి రూ.11,877 విలువైన దమ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అలాగే పడకల్‌కు చెందిన యాటకర్ల శ్రీకాంత్ మద్యం విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేసి రూ.10,471 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

యువకుడి అదృశ్యం

నవీపేట: మండల కేంద్రానికి చెందిన మ్యాతరి నందు రెండు రోజుల క్రితం అదృశ్యమనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. తండ్రి నర్సయ్య ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.